## నేడు సీపీఎం జిల్లా ప్లీనరీ సమావేశం

ఎదులాపుర, జనవరి 9 : ఆదిలాబాద్‌లోని సుందరయ్య భవనంలో బుధవారం సీపీఎం జిల్లా ప్లీనరీ సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ తెలిపారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీన్లరీ సమావేశానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ, రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా ఇన్‌చార్జి బండారు రవికుమార్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పార్టీ నేతలు పీన్లరీ సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం సీనియర్ నాయకుడు బండి దత్తాత్రేయ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అన్నమొల్ల కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జు ఆశన్న, మంజుల పాల్గొన్నారు.

## ఆరోగ్య ఉప కేంద్రం ప్రారంభం

బోథ్, జనవరి 9: పట్నాపూర్ గ్రామంలో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్ర భవనాన్ని మంగళవారం ఎంపీ సోయం బాపురావు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుగుణ, వైస్ ఎంపీపీ రాథోడ్ లింబాజీ, డాక్టర్ నవీన్‌రెడ్డి, ప్రియాంక, రాజుయాదవ్, ఐటీడీఏ డైరెక్టర్ భూమన్న, ఏఎన్ఎం కవిత, ఆశకార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోళ్లు నిలిపివేత

బోథ్, జనవరి 9 : బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలోని సొనాల, నేరడిగొండ కేంద్రాల్లో సీసీఐ ఆధ్వర్యంలో చేపడుతున్న పత్తి కొనుగోళ్లను బుధవారం నుంచి ఈ నెల 16 వరకు నిలిపి వేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి దేవన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కేంద్రాల పరిధిలోని జిన్నింగ్ మిల్లుల్లో పత్తి నిలువలు పేరుకుపోయినందున కొనుగోళ్లు ఉండవని పేర్కొన్నారు. ఈ నెల 17న కొనుగోళ్లు తిరిగి ప్రారంభమవుతాయని రైతులు గమనించాలని కోరారు. బోథ్, పొచ్చెర కేంద్రాల్లో మాత్రం కొనుగోళ్లు ఉంటాయని తెలిపారు.

## ఆర్టీసీ బస్సు సేవలను కల్పించండి

ఆదిలాబాద్ రూరల్, జనవరి 9 : మారుమూల గ్రామాలకు సైతం ఆర్టీసీ బస్సు సేవలను అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయంలో డిపో మేనేజర్ కల్పనను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఆదిలాబాద్ రూరల్, జైనథ్, బేల మండలాల్లోని మారుమూల గ్రామాలకు ఆర్టీసీ సేవలను కల్పించాలని కోరారు. లాండసాంగి, అర్లి, ఆడ గ్రామాలకు ఆర్టీసీ సర్వీసులను సైతం పునరుద్ధరించాలని విన్నవించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మార్వీ భవనం ప్రారంభం

భీంపూర్, జనవరి 9 : మండల కేంద్రంలో ఎమ్మార్వీ (మండల విద్యావనరుల కేంద్రం) భవనాన్ని మంగళవారం ఉదయం 11 గంటలకు బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ప్రారంభించనున్నారని జడ్పీటీసీ కుమ్ర సుధాకర్, ఎంపీపీ రత్నప్రభ, వైస్ఎంపీపీ గడ్డం లస్మన్న ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు సకాలంలో హాజరుకావాలని కోరారు.

## పిల్లల కథల పోటీల్లో విద్యార్థి ప్రతిభ

ఎస్ హరి ఓం

జైనథ్, జనవరి 9: మాచిరాజు బాల సాహిత్య పీఠం హైదరాబాద్ వారు నిర్వహించిన 2023 సంవత్సరం బడి పిల్లల కథల పోటీల్లో ఉత్తమ కథగా మండలంలోని లక్ష్మీపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థి ఎస్ హరి ఓం రాసిన 'సమయ స్ఫూర్తి' అనే కథ ఉత్తమంగా ఎంపికైంది. త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో హరి ఓంకు జ్ఞాపిక, ఉత్తమ కథగా ఎంపికైనట్లు సర్టిఫికెట్, బాల సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలు అందజేస్తారు. విద్యార్థిని ఎంపీటీసీ జయమాల మనోజ్, సర్పంచ్ దాసరి లక్ష్మీరాములు, ఉప సర్పంచ్ గాజంగుల స్వామి, ప్రధానోపాధ్యాయుడు పోరెడ్డి అశోక్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

# భవిష్యత్తులో విజయాలు సాధిద్దాం

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్
- ప్రతిభ చాటిన క్రీడాకారులకు అభినందన

కప్పును అందుకుంటున్న ఐటీడీఏ పీవో బాజ్‌పాయ్

ఉట్నూర్, జనవరి 9: వచ్చే సంవత్సరం ఉట్నూర్ వేదికగా నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడల్లో ఈ విజయ పరంపరను సాగిద్దామని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. మంగళవారం పీవో క్యాంపు కార్యాలయంలో కిన్నెరసానిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో విజేత కప్పును ఆమెకు అందించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులు, కోచ్‌లు, ఉపాధ్యాయులను ఆమె అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వచ్చే సంవత్సరం రాష్ట్రస్థాయి పోటీలు ఉట్నూర్ వేదికగా జరగనున్నాయని, అప్పటికీ అన్ని క్రీడల్లో క్రీడాకారులకు ఉత్తమ శిక్షణ ఇవ్వాలన్నారు. అలాగే ఈ విజయాలు కొనసాగించాలన్నారు. క్రీడాకారులకు అవసరమైన సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. ప్రధానోపాధ్యాయుడు గోడం చందన్, మడావి కృష్ణారావు, ప్రేమ్‌దాస్, ఉత్తమ్‌దాస్, రాథోడ్ ప్రకాశ్, గోపాల్, క్రీడాధికారి పార్థసారథిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఏపీవో భీంరావ్, ఆత్రం భాస్కర్, ఏవో రాంబాబు, పీడీలు హేమంత్, శ్రీనివాస్, శేఖర్, సునంద్ పాల్గొన్నారు.

## పూసాయి ఎల్లమ్మ ఆలయం ముస్తాబు

- రేపటి నుంచి జాతర ప్రారంభం

జైనథ్, జనవరి 9 : జైనథ్ మండలం పూసాయి గ్రామంలో ఈ నెల 11వ తేదీన పుష్యమాస అమావాస్య నుంచి ఫిబ్రవరి 12 మాఘమాసం వరకు నెల రోజుల పాటు సాగే జాతరకు పూసాయి ఎల్లమ్మ ఆలయం ముస్తాబైంది. సర్పంచ్ అల్లూరి పోతారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. ఎల్లమ్మ ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ఈ జాతరకు తెలంగాణ రాష్ట్రంలోని ఆయా జిల్లాలతో పాటు మహారాష్ట్రలోని పాండరకోడ, యావత్మాల్, బోరి జిల్లాలోని ఆయా గ్రామాల భక్తులు, మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఎల్లమ్మ దేవికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు.

**పుష్యమాసం ప్రత్యేకం**

పుష్యమాస అమవాస్య రోజు డప్పుచప్పుళ్ల మధ్య పూసాయి గ్రామ మహిళలు, భక్తులు ఊరేగింపు నిర్వహిస్తారు. అమ్మవారికి అభిషేకం చేసి నైవేద్యం సమర్పిస్తారు.

**పూసాయి ఎల్లమ్మ కోనేరు ప్రత్యేకత**

ఎల్లమ్మ తల్లి గర్భగుడి నుంచి వచ్చే జల ధార చెరువులో భక్తులు స్నానం చేస్తే చర్మ రోగాలు నయం అవుతాయని గ్రామస్తుల నమ్మకం. దీంతో పాటు చీడ పీడలు ఆశించిన పంటలకు చెరువు నీటిని చల్లితే పంటలు సమృద్ధిగా పండుతాయని గ్రామస్తుల నమ్మకం.

పుసాయి ఎల్లమ్మ ఆలయం

## ద్విచక్రవాహనాల కోసం ఫోన్ చేయవద్దు

ఎదులాపురం, జనవరి 9 : నంబర్ ప్లేట్ లేని, ట్రిపుల్ రైడింగ్‌లో పట్టుబడిన వాహనాలను విడుదల చేయాలని ఎవరు ఫోన్ చేయవద్దని ట్రాఫిక్ సీఐ ప్రణయ్ కుమార్ అన్నారు. మంగళవారం రెండో రోజు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. నంబర్ ప్లేట్ లేని ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్ నింబంధనల ప్రకారం వేసిన జరిమానాలు చెల్లించి వాహనాలు తీసుకెళ్లాలని సూచించారు. 44 వాహనాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. డ్రైవ్‌లో ఎస్ఐలు ఖాజామొహినుద్దీన్, సాయన్న, ఏఎస్ఐ అరుణ్‌ఖాన్, ప్రకాశ్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

## రాములోరి అక్షింతల పంపిణీ

బోథ్, జనవరి 9: బోథ్‌లో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం అయోధ్య రాములోరి అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. వారం రోజులుగా ప్రతి కాలనీలో ఇంటింటికీ వెళ్లి అక్షింతలు అందజేస్తున్నారు. చివరి రోజున బోథ్ పోలీస్ స్టేషన్‌లో సీఐ భీమేశ్, ఎస్ఐ రాము, సిబ్బంది కుటుంబాలకు అక్షింతలు అందజేశారు. ఎవరికైన అక్షింతలు చేరకుంటే స్థానిక మార్కండేయ ఆలయం వద్దకు వచ్చి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు పాల్గొన్నారు.

నార్నూర్, జనవరి 9 : మండల కేంద్రంలో హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన రాములోరి అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. మండలంలోని మాన్కాపూర్, రాజుల్‌గూడ గ్రామస్తులు అక్షింతలను శోభాయాత్రగా గ్రామానికి తీసుకెళ్లారు. అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేస్తామని గ్రామపెద్దలు తెలిపారు. కార్యక్రమంలో రాథోడ్ సావీందర్, రాయిసిడాం రూప్‌దేవ్, భీంరావ్, మెస్రం దేవ్‌రావ్, కైలాస్, ఉత్తమ్, రాంనివాస్, గోవింద్, బాపురావ్, ప్రకాశ్, గణేశ్, సీతారామ్, భక్తులు పాల్గొన్నారు.

## పరీక్షలను పరిశీలించిన ప్రత్యేకాధికారి

ఇచ్చోడ(సిరికొండ), జనవరి 9: సిరికొండ మండలం రాయిగూడ, రిమ్మ గ్రామాల్లోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ ఆదేశాల మేరకు పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన మిషన్ లక్ష్యం గ్రాంట్ టెస్ట్-2ను ప్రత్యేకాధికారి విజయ్ ప్రకాశ్ పరిశీలించారు. ఈ పరీక్షలు మూడు రోజులు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆయన వెంట హెచ్ఎం రవీందర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

# పకడ్బందీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా

ఇంద్రవెల్లి : దరఖాస్తుల ఆన్‌లైన్ వివరాలు తెలుసుకుంటున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్

ఇంద్రవెల్లి, జనవరి 9: ప్రజల ద్వారా స్వీకరించిన ప్రజాపాలన దరఖాస్తులను పకడ్బందీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా అధికారులకు సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన ఆరు గ్యారెంటీల దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో మొత్తం 12,272 దరఖాస్తులు రాగా 4,630 ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. మండలంలోని గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న వారి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. చేసిన ఆన్‌లైన్ నమోదు వివరాలు ఎప్పటికప్పుడు పూర్తి సమాచారం అందించాలన్నారు. ఆమె వెంట ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో సంతోష్‌కుమార్ ఉన్నారు.

బోథ్, జనవరి 9 : మండల వ్యాప్తంగా 33 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక సభల ద్వారా సేకరించిన ప్రజాపాలన ఆరు గ్యారెంటీల దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ కొనసాగుతున్నది. మండలంలో మొత్తం 14,842 దరఖాస్తులు రాగా 7,631 ఆన్‌లైన్‌లో నమోదు చేశామని ఎంపీడీవో సుశీల్‌రెడ్డి తెలిపారు. మండల పరిషత్, ఈజీఎస్, బోథ్ జీపీ, తహసీల్ కార్యాలయాల్లో 25 కంప్యూటర్ల ద్వారా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎంపీడీవో, మండల పంచాయతీ అధికారి జీవన్‌రెడ్డి పర్యవేక్షణలో ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు తమ జీపీలకు సంబంధించిన దరఖాస్తులను దగ్గరుండి ఆన్‌లైన్ చేయిస్తున్నారు.

## లక్కీడ్రా పేరుతో ఘరానా మోసం

- రెండున్నర తులాల బంగారంతో పరారీ

గుడిహత్నూర్,జనవరి 9 : లక్కీ డ్రాలో విలువైన వస్తువులు గెలుపొందారని చెప్పి ఓ మహిళకు ఫోన్ చేసి ఆమె ఒంటిపై ఉన్న రెండున్నర తులాల బంగారాన్ని తీసుకొని ఉడాయించిన ఘటన మంగళవారం గుడిహత్నూర్‌లో చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని వడ్డెర కాలనీకి చెందిన బాధిత మహిళ లలిత తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యాహ్న సమయంలో ఓ వ్యక్తి ఫోన్ చేసి మీరు లక్కీడ్రాలో విలువైన వస్తువులను గెలుపొందారని ఇంటికి వచ్చాడు. విలువైన వస్తువులతో పాటు మరి కొన్ని వస్తువులు పొందాలంటే దానికి సరిపడా బంగారం తాకట్టుపెట్టాలని నమ్మించాడు. తాను నమ్మి మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు గొలుసును తీసి అతని చేతిలో పెట్టింది. తూకం వేసి తీసుకుంటానని తనతో బంగారం దుకాణం వరకు రావాలని నమ్మించి బైక్‌పై ఎక్కించుకున్నాడు. బంగారం దుకాణానికి కొద్ది దూరంలో దించేసి బైక్‌పై పరారయ్యాడు. ఈ విషయంపై ఎస్ఐ సయ్యద్ ఇమ్రాన్‌ను వివరణ కోరగా బాధిత మహిళ పోలీస్ స్టేషన్‌కు వచ్చి చెప్పింది. ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

## గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం

ఇంద్రవెల్లి, జనవరి 9: ముత్నూర్ గ్రామంలో గుర్తు తెలియని వృద్ధురాలు మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఎస్ఐ డీ సునీల్ వివరాల ప్రకారం.. ముత్నూర్ గ్రామంలో ఓ షెటర్ల వద్ద గుర్తు తెలియని వృద్ధురాలు (80) మృతదేహం గుర్తించడం జరిగింది. గత కొద్ది రోజుల నుంచి ఆ వృద్ధురాలు ఓ దాబా పక్కన ఖాళీగా ఉన్న షెటర్ల వద్దనే ఉంటునట్లు గ్రామస్తులు తెలిపారు. సోమవారం రాత్రి మృతి చెందినట్లు గ్రామస్తులు చెప్పారని ఎస్ఐ డీ సునీల్ తెలిపారు. వృద్ధురాలు మృతదేహాన్ని ఉట్నూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించి మర్చరిలో ఉంచినట్లు ఆయన తెలిపారు.

# పథకాలు అర్హులకు అందేలా చూడాలి

మాట్లాడుతున్న ఎంపీపీ దర్శనాల సంగీత ఏవన్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 9 : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరు గ్యారెంటీ పథకాలు అందేలా చూడాలని మావల ఎంపీపీ దర్శనాల సంగీత ఏవన్ అన్నారు. మంగళవారం మావలలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తూ మండలాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలన్నారు. అనంతరం 15వ ఆర్థిక సంఘం నిధులతో మండలంలోని పలు గ్రామాల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మాణం చేసేందుకు తీర్మానం చేశామని తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్ రెడ్డి, ఎంపీడీవో సునీత, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీవో లక్ష్మణ్, మావల, వాఘపూర్ సర్పంచ్‌లు ప్రమీలా, మడావి మయూరి, అధికారులు పాల్గొన్నారు.

## జంగుబాయి దేవస్థానంలో దీపారాధన

నార్నూర్, జనవరి 9 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం పరందోళి గ్రామ శివారులో కొలువుదీరిన జంగుబాయి దేవస్థానంలో ఈ నెల 14వ తేదీన ఆదివాసీల సంప్రదాయ ప్రకారం దీపారాధన ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు మారప బాజిరావ్ తెలిపారు. మండలంలోని గుండాల గోండుగూడలో మహారాష్ట్రతో పాటు ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది గోత్రల ఆదివాసులు మంగళవారం సమావేశమయ్యారు. దేవస్థానంలో సౌకర్యాలు, ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుష్య అమవాస్యను పురస్కరించుకొని ఆదివాసీలు జంగుబాయి దేవస్థానంలో నెల రోజుల పాటు మొక్కులు చెల్లించుకుంటారని, జనవరి 14న దీపారాధన, 15 నుంచి నెల రోజులు పూజలు నిర్వహిస్తారని, 25న మహాపూజ ఉంటుందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారన్నారు. దేవస్థానంలో వసతుల ఏర్పాటు కోసం ఉట్నూర్ ఐటీడీఏ పీవోకు తీర్మాన పత్రం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కొడపజాకు, ఉపాధ్యక్షుడు రాయిసిడాం జంగు, శ్రీరామ్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

మాట్లాడుతున్న ఎంఈవో ఉదయ్‌రావ్

ఇచ్చోడ(సిరికొండ), జనవరి 9 : ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈవో ఉదయ్‌రావ్ సూచించారు. మంగళవారం సిరికొండలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్ పూర్తి చేయాలన్నారు. ఎఫ్-3, ఎస్ఏ-1 మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఉపాధ్యాయుల సమయ పాలనపై ఫిర్యాదు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్ఎం సునీల్, కాంప్లెక్స్ కార్యదర్శి జైతు, ఆర్‌పీఎస్ విజయ్, శ్రీనివాస్, సీఆర్పీ రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఇచ్చోడలో..

ఇచ్చోడలోని జడ్పీ పాఠశాలలో మంగళవారం కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో ఉదయ్‌రావ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో నోడల్ అధికారి బిక్కు, హెచ్ఎం శ్రావణ్, సీఆర్పీ శ్యాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ఉండాలి

మాట్లాడుతున్న ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమన్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 9: ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా, మానసికంగా దృఢంగా ఉండాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డిపో గ్యారేజ్‌లో టీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో ఉద్యోగులందరికీ వన భోజన మహోత్సవం ఏర్పాటు చేశారు. అంతకు ముందు ఉద్యోగులు కోసం ఆటలపోటీలు నిర్వహించగా వారందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆట పాటలతో సరదాగా గడిపి కొంత సేదతీరారు. అనంతరం భోజనాలు చేశారు.

## తక్కువ ధరకు విక్రయించొద్దు

కందుల తేమ శాతం చూస్తున్న సీఈవో ప్రజ్ఞశీల్

ఉట్నూర్ రూరల్, జనవరి 9: రైతులు పండించిన కందులు తొందరపడి తక్కువ ధర విక్రయించొద్దని సెర్ప్ ఎఫ్‌సీసీ సీఈవో కాంబ్లే ప్రజ్ఞశీల్ అన్నారు. మంగళవారం మండలంలోని గంగాపూర్, ఆలీపూర్, కామాయిపేట్ గ్రామాల్లో పర్యటించారు. గ్రామస్తులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు. గ్రామాల్లో దళారులకు తక్కువ ధరకు అమ్మి మోసపోకూడదని సూచించారు. నేషనల్ అగ్రికల్చర్ కో ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ప్రమాణాలు పాటించి వారికి విక్రయించడం ద్వారా మంచిధర లభిస్తుందని వివరించారు. తేమ శాతం 12 కంటే తక్కువగా ఉండేటట్లు ఆరబెట్టాలని అన్నారు. రైతులకు ఇంకా సమాచారం కావాలంటే మండల సమాఖ్య నందు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ రాజేశ్వర్, వీవోఏ చంపత్‌రావు, రైతులు పాల్గొన్నారు.

## విజయవంతం చేయండి

ఉట్నూర్, జనవరి 9: ఈ నెల 29న చలో ఇందిరాపార్క్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గణేశ్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 5వ షెడ్యూల్ భూభాగంలోని క్లాస్1 ప్రకారం స్థానిక ఆదివాసీల చేతనే ఉద్యోగాల భర్తీ చేపట్టాలన్నారు. ఆదివాసీ నిరుద్యోగులకు దక్కాల్సిన ఉద్యోగాలు జనరల్ నోటిఫికేషన్‌తో మైదాన ప్రాంతవాసులను ఉద్యోగ భర్తీ చేస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రాంతంలో అమలులో ఉన్న 29 శాఖల షెడ్యూల్ ప్రాంత జీవోల ప్రకారం ఆదివాసీలకు మాత్రమే ఏజెన్సీ సర్టిఫికెట్ అర్హతగా ఉద్యోగాలు ఐటీడీఏ ద్వారా ఇవ్వాలని కోరారు. 2014 వరకు ఐటీడీఏ పరిధిలో రిక్రూట్‌మెంట్ అయిన ఏజెన్సీ డీఎస్సీలు ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు.

## ఉద్యోగావకాశాలు

ఎదులాపురం, జనవరి 9 : ఆదిలాబాద్ జిల్లా నిరుద్యోగ యువకుల కోసం హైదరాబాద్ ఫ్లిప్‌కార్ట్‌లో ఉద్యోగాల కోసం బుధవారం ఉదయం 10.30 గంటలకు సాత్నాల క్వార్టర్స్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి మిల్కా ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారికి ప్రతి నెల రూ.13వేల నుంచి రూ.22వేల వరకు వేతనం ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 9515535163, 7659978443ను సంప్రదించాలని సూచించారు.

## సైబర్ నేరాలపై అవగాహన

తాంసి(తలమడుగు), జనవరి 9: తలమడుగులోని తహసీల్ కార్యాలయ సమీపంలో పోలీసులు వాహన చట్టాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ జగన్‌సింగ్ మాట్లాడుతూ ప్రజలు పోలీస్ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తెలియని వారికి ఓటీపీ చెప్పొద్దని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి

నార్నూర్, జనవరి 9 : ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి శ్రీనివాస్‌కుమార్ అధ్యాపకులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. కళాశాలలో మౌళిక వసతులతో పాటు పలు రికార్డులు పరిశీలించారు. తరగతిని సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గైర్హాజరు కాకుండా చూడాలన్నారు. వెనుబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దాలన్నారు. అధ్యాపకులు ఆయనను శాలువాతో సన్మానించారు. ఇక్కడ సీనియర్ ప్రిన్సిపాల్ జాదవ్ గణేశ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ టీ మహేందర్‌కుమార్, ఎన్ఎ స్ఎస్ ప్రోగ్రాం అధికారి బాలాజీకాంబ్లే, అధ్యాపకులు ఉన్నారు.

మాట్లాడుతున్న జిల్లా మాధ్యమిక విద్యాధికారి

## తుడుందెబ్బ మండల కమిటీ ఎన్నిక

ఎన్నికైన మండల కమిటీ సభ్యులు

బోథ్, జనవరి 9 : మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో మంగళవారం ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ బోథ్ డివిజన్ అధ్యక్షుడు దుర్వ విశ్వేశ్వర్ రావ్ అధ్యక్షతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా కనక అమృత్‌రావ్, కార్యనిర్వహణాధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా మంగరపు మహేశ్, సంగెపు శంకర్, ప్రధాన కార్యదర్శిగా సెడ్మాకి సురేశ్, కోశాధికారిగా మండడి రాము, కార్యదర్శులుగా ఆత్రం మోహన్, ఆత్రం సుంగన్న, నల్లాల శ్రీకాంత్, ప్రచార కార్యదర్శులుగా అవినాశ్, నైతం కేశవ్, దేవరావ్, పంద్రం సోనేరావ్, సాంస్కృతిక కార్యదర్శిగా మడావి లాలురాం, సలహాదారులుగా ఆడెం భీంరావ్, మడావి గంగాధర్, భోజన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్, జిల్లా అధ్యక్షుడు పూర్క బాపురావ్, ఉపాధ్యక్షుడు భోజన్న, ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, జిల్లా కార్యనిర్వహణాధ్యక్షుడు నైతం రమేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉయిక సుదర్శన్, జిల్లా ఉపాధ్యక్షులు కుమ్రం జంగు, వరుణ్, యాదవ్‌రావ్, బాబేర సార్‌మేడి మడావి గంగారాం, పట్నాపూర్ సార్‌మేడి భీంరావ్ పాల్గొన్నారు.

## అమరవీరుల స్తూపానికి అదనంగా ఒక ఎకరం భూమి కల్పించాలి

ఇంద్రవెల్లి, జనవరి 9: